# 2

# సంపూర్ణాహుతి

"సర్వమంగళాదేవీ, కాశ్మీరాధీశ్వరులు శ్రీ పర్వగుప్తులు మీరు స్వయంగా నిర్మింపజేయిస్తున్న యశస్కరస్వామి దేవాలయంలో, బంగారు దేవతాప్రతిమలకోసం పదివేల సువర్ణ దీనారాలు బహూకృతిగా స్వీకరించవలసిందని సవినయంగా ప్రార్థిస్తున్నారు. మీ అనుమతి లభించినంతలోనే వారా సువర్ణరాశి తమ సన్నిధికి పంపించవలెనని ఇనుమిక్కిలిగా ఉవ్విళ్ళూరుతున్నారు."

కాశ్మీర మహారాజ దూతిక రాజహంసి తన ఏలిక విజ్ఞప్తి నివేదించి అత్యంత వినయంతో దోసిలికట్టి నిలుచున్నది.

అది విని సర్వమంగళాదేవి, ఆమె ప్రధాన పరిచారిక లవంగిక కొన్నిక్షణాలపాటు ఎంతో ఆశ్చర్యపడ్డారు. కాని సర్వమంగళ ఆ అచ్చెరువు పై కేమాత్రము వ్యక్తం కానియ్యలేదు. సముచిత మర్యాదతో చిరునవ్వు చిందించి, మహారాజ దూతిక ముఖపై ఖరి నీతంగా పరిశీలించింది.

"రాజహంసీ, ముమ్మందుగా పర్వగుప్త ప్రభువులకు నా సగౌరవ సాష్టాంగ నమస్కృతి నివేదించవలసినది. ఆపైన వారి ఆదరదృష్టికి నేనెంతయినా ఋణపడి ఉన్నానని విన్నవించవలసినది. ఇక పదివేల పైడిదీనారాల బహూకృతిమాట! స్వర్లోకానికి విజయం చేసిన మా ప్రాణేశ్వరులు యశస్కర మహీనాథుల అపార కృపవల్ల ఈ క్షణంవరకు వారిపేరట రూపొందిస్తున్న పరమేశ్వర దేవాలయానికేవిధమైనకొదవ కలగలేదు!

"అయితే శిల్పులు కొందరు శీఘ్రంగా పరిశ్రమించకపోవడం వల్లనేమో,అనవసరంగా కొంత కాలయాపనం జరుగుతున్నది. అంతే గాని ధనలోపమేమి లేదు. ఇదే విషయం పర్వగుప్తప్రభువుల దివ్య చిత్తానికి విశదంచేసి, ప్రస్తుతానికి వారి బహుమానం స్వీకరించలేక పోతున్నందుకు మన్నించవలిసినదని నా మాటగా వేడుకోవలిసినది. అయితే ముందు, ఎప్పుడయినా ద్రవ్యలోపం కలిగినప్పుడు తప్పక వారి తోడ్పాటు వేడుకోగలనన్న నా విన్నపం ప్రత్యేకంగా అందించవలిసినది."

తిరిగి ఏదో విన్నవించవలెనని రాజహంసి రవంతసేపు తటపటాయించింది. కాని ఆపైన మరి నివేదించవలసినదేది స్ఫురించక, సగౌరవంగా పీడ్కొని తన ప్రభువు సన్నిధికి తరలిపోయింది.

సర్వమంగళ దీర్ఘాలోచనలో పడింది. లవంగిక అది పసికట్టి ఉట్టిపడుతున్న ఆప్యాయతతో ప్రశ్నించింది.

"ఇదేమిటి మహారాజ్ఞీ, ఈ విచిత్రం! ఎందుచేతనో పర్వగుప్తుల కీనాడు మీ ఎడల పరమానుగ్రహం కలిగినట్టున్నదే!"

"అవునవును! అయితే ఇది పరమానుగ్రహం కాదులే! ప్రత్యేకించి నన్ను కించపరచాలని చేసిన పని!"

సర్వమంగళ అణగించి వేసుకున్న అక్కసుతో కస్సుమని బుసకొట్టింది: లవంగిక రవంతసే పాలోచించింది.

"కాదేమోనమ్మా! అనవసరంగా మీ రపోహ పడుతున్నారేమో!"

"ఎందుచేత?"

"మీ రన్నదే నిజమయితే ఆయన పదివేల సువర్ణ దీనారాలర్పించి, మీ ప్రసన్న దృష్టికోసం ప్రాధేయపడతారా?"

"అయితే స్వామి దేవాలయ నిర్మాణాని కింతటి ఆలస్యం ఎందుకు జరుగుతున్నది?"

"దీనికంతటికి ప్రధానకారణం పర్వగుప్తులే అంటారా?"

"కాకపోతే మరి వేరే కారణ మేమిటి?"

సర్వమంగళ ముడిపడిన బొమముడితో అడిగింది.

అంతలోనే ఆమె తిరిగి తొందరగా ఆదేశించింది.

"సరే, దీని కేమిటిలే! త్వరగా నా అలంకరణం ముగించి, ఆ దేవాలయ ప్రధానశిల్పి మరి కంటికికనిపించకపోవడానికేమి కారణమో కనుక్కో!"

లవంగిక మాట్లాడలేదు. లత్తుకతో రాజ్ఞి చరణాలపై లతికల చిత్రణం ముగించింది. మహారాజ్ఞీ గౌరవచిహ్నమయిన మంకెన పూలమాలిక వీనులమీదుగా ముంగురులపై నిలిపింది. నెన్నుదుటిపై కుంకుమతో మెదిపిన సన్నని కస్తూరీ తిలకం తీర్చిదిద్దింది.

సర్వమంగళాదేవి కింకా మూడుపదుల ప్రాయం నిండలేదు. రవంత కావిరంగు కలిపిన తెలిమల్లెపువ్వవంటి తెల్లని నెమ్మేని చాయతో, శేత శేనెవన్నెచీర చిన్నారి చెరగుతో అలవోకగా అమర్చుకున్న మేలిముసుగుతో, దానిలోనుండి తళతళలాడుతున్న రతనాల కర్ణాభరణాలతో ఆమె సాక్షాత్తు సమక్షంలో నిలిచిన పర్వతరాజపుత్రిక సర్వమంగళా దేవివలె మెరిసిపోతున్నదని లవంగిక అనుకున్నది.

అంతలోనే కొంతకాలంక్రితం కాశ్మీరం జేగీయమానంగా పరిపాలించిన యశస్కరమహారాజు కాలంనాటి సర్వమంగళ ప్రాభవము, ఐశ్వర్యము, భాగ్యభోగాలు తలుచుకుని తలుచుకుని బాగా దిగాలుపడి ఉసూరుమని నిట్టూర్చింది. కాటుక కణికెతో సోగదేరిన నేత్రాలలో, కటాక్షాలలో కజ్జలరేఖ రూపొందించి, చెక్కిళ్ళపై లొద్దుగపూల పుప్పొడి చిలకరించి నెమ్మదిగా అద్దింది.

అంతలోనే వికసిస్తున్న చిరునవ్వుతో, చెంగలిస్తున్న జిజ్ఞాసతో సర్వమంగళ లవంగిక నడిగింది.

"ఇదేమే! నీ వీ వేళ ఎందుకో యెంతో దిగులు పడుతున్నట్టున్నావు!"

ప్రధాన పరిచారిక తిరిగి ఉసూరుమని నిశ్వసించింది.

"ఏమీలేదమ్మా! సాటిలేని ఐశ్వర్యంతో, ఔదార్యంతో, అచ్చమయిన నడవడితో అలనాడు మీ రందరిచేత ఔనౌననిపించుకున్నారు! అటువంటివారికి మీ కీనాడు లోకులంటున్న మాటలు చెవినిపడితే

ఎంతటి మనస్తాపం కలుగుతుందో అని గుంజాటనపడుతున్నాను! అంతే!"

సర్వమంగళ కొంతసేపు ఆశ్చర్యపడి నిశ్చల నేత్రాలతో ప్రశ్నించింది.

"నేనేమి మథనపడనులే! సరే, ఇంతకి లోకు లేమను కుంటున్నా రే?"

లవంగిక కొంచెం తటపటాయించింది.

"అమ్మా! లోకులు కాకులు! అయితే వా రెంతటి అభిజ్ఞ లయినా, మీవంటి మహారాణులు వారి మాట టొత్తిగా తీసి పార వెయ్యడానికి వీలులేదు. యశస్కర మహారాజు స్వర్గలోకానికి విజయం చేసిన పిమ్మట అప్పుడే దరిదరిగా ఏడాది గడిచిపోవచ్చింది. అయినా మీరు ఆనాటి కానాడు అచ్చంగా నూతన వధువన్నట్టుగానే అలంకరించుకుంటున్నారు. అంతేగాని ఆవంతయినా కొదవ కలగ నియ్యడంలేదు!"

"అవును, నిజమే! అయితేనేమి?" రాజ్ఞి హేలగా తల పంకించి ప్రశ్నించింది.

లవంగిక రవంతసేపాగి తిరిగి ప్రారంభించింది.

"ఇది గమనించి, ఇంతకుమునుపే ప్రజ లనేక విధాల గుస గుసలాడుకుంటున్నారని విన్నాను! ఆపైన మీరు స్వామి దేవాలయ నిర్మాణం స్వయంగా పరిశీలించే సమయంలో పర్వగుప్త ప్రభువులు తమ ప్రాసాదంమీద నిలిచి రెప్పపాటయినా లేని నిశ్చల నేత్రాల దోసిళ్ళతో మీ చిక్కని చక్కదనం జుర్రుకుంటున్నారని కూడా తెలిసింది!"

"ఓహో! అలాగా! నా కీ విడ్డూరమే ఎరుకపడలేదే!"

సర్వమంగళ నిలువునా నిర్ఘాంతపడింది. లవంగిక నిమేష కాలం మౌనం వహించింది.

"మహారాజ్ఞీ! మీ సౌందర్యాన్ని గురించి నే నిప్పుడు ప్రత్యే కించి ప్రశంసించనక్కరలేదు గదా! ఆపైన అచ్చంగా రాజనర్తకిలా అలంకరించుకుంటున్నారాయెను! మీరు స్వయంగా స్వామి దేవాలయ

నిర్మాణం పరిశీలిస్తున్నప్పుడు తండోపతండాలుగా ప్రజలక్కడికి వచ్చి గుమిగూడుతున్నారు: అటువంటప్పుడు సర్వాగుప్తులు మీ సందర్శనం కోసం తహతహపడి మైమరచిపోవడంలో ఆశ్చర్యమేమి ఉన్నది?"

"లవంగికా! నీ వన్నది నిజమే! కాని దీనికింత రభస జరుగు తున్నదని నాకు తెలియనే లేదు! ....అయితే మరి నేనైై తలపెట్టిన యశస్కరుల దేవళం నిర్మాణంలో అడుగడుగునా ఇన్ని అడ్డంకు లెందుకు ఏర్పడుతున్నాయో!"

"అదేమోనమ్మా! అదంతా మీకే తెలియాలి! నా వంటిదాని కా రహస్యా లెలాగ తెలుస్తాయి!"

లవంగిక రాజ్ఞి ముంగురులపై మంకెన పూలమాలిక రవంత చక్కదిద్ది, వేరే పనిమీద భవంతిలోపలికి వెళ్ళిపోవాలని అనుమతి అర్థించింది.

కాని ఆ మాటే లక్ష్యపెట్టక సర్వమంగళ సూటిగా అడిగింది.

"అయితే శ్రీనగర ప్రజ నన్నుగురించి ఇంకా ఏమేమని ఆడి పోసుకుంటున్నారే?"

"అమ్మా, తెలిసీ తెలియని పామరుల నిందలతో మీ కనవస రంగా వ్యథ కలిగించడం నా కిష్టంలేదు: అదీగాక మీది ఎంతో లోతయిన నిండుగుండె అని నాకు తెలియకపోలేదు. అయితే మీ రిలాగ ప్రతిదినము కొత్త పెళ్ళికూతు రన్నట్టుగా అలంకరించు కోవడంవల్ల, సర్వాగుప్తుల ప్రగాఢాసక్తివల్ల ప్రజ అన్నివిధాల అను కోవడంలో ఆశ్చర్యం లేదు: నే నిలాగ ఉన్నమాట అన్నానని ఆగ్ర హించవద్దని మనవి."

ప్రధాన పరిచారిక అంజలి ఘటించి, పరిదీన స్వరంతో ప్రాధేయపడింది. మహారాజ్ఞి ఊపిరిఅంతా విడిచివేస్తున్నట్టు సుదీర్ఘ మయిన నిట్టూర్పు విడిచిపెట్టి పొడిగా నవ్వింది.

"లవంగికా, దీనిలో నీపై కోపించవలసినదేమి ఉన్నదిలే! అయితే ఇంతకాలంనించి నన్నెరుగుదువుకదా? నీకుకూడా నామీద అనుమానం కలుగుతున్నదా?"

ప్రధాన పరిచారిక దాని కేవిధంగాను ప్రతిసమాధానం చెప్ప

లేదు. శిరస్సు ఒకించుక వంచి, కనురెప్ప లల్లన వాల్చింది.

"మీ రన్నమాట నిజమే! ఎంతోకాలంనించి మీ కొలువులో కుదురుకున్నాను. అయినా మీ ఆంతర్యం నా కెన్నడు తిన్నగా బోధ పడలేదు. యశస్కరు లస్తమించి అప్పుడే ఏడాది కావస్తున్నది! అయినా మీ అలంకరణ యథాప్రకారంగానే కొనసాగుతున్నది! దీని అంతరార్థమేమో నా కీ నాటికి అవగాహన కాలేదు."

"లవంగికా! నీ వీ మర్మం గ్రహించుకోగల వనుకున్నాను సుమా!"

రాజ్ఞి అధరంపై దరస్మితం తొణికిసలాడింది. ప్రధాన పరిచారిక ముఖంలో జిజ్ఞాస మరింతగా పొటమరించింది. రెట్టించిన ఆతకుపతో తన అజ్ఞత వెల్లడించింది.

"మీ నిండు గుండె లోతెంతటిదో అజ్ఞురాలను నే నేమి గ్రహించుకోగలనమ్మా!"

మహారాజ్ఞి మరి గత్యంతరం కానలేక, రవంత నిట్టూర్చి లేత నవ్వుతో తన మనోగతం వ్యక్తీకరించింది.

"లవంగికా! లోకం దృష్టిలో నా ప్రాణేశ్వరు లింతకు మునుపే అస్తమించి ఉండవచ్చును! కాని నా లోలోపలి చూపులో ఆయన ఎల్లవేళల అజరామరులే! వా రనుక్షణము నా హృదయ పీఠికపై నిలిచి, చిరునవ్వులతో జాజ్జ్వల్యమానంగా వెలుగుతున్నారు! అటువంటప్పుడు వారి దివ్యమూర్తికి దేవళంవంటి నా శరీరం సర్వదా చక్కగా అలంకరించుకోవద్దా! విషాదము, దుఃఖము, దైన్యము వారి ఆనందమయ తేజోమూర్తి యెడల మహాపచారాలు కావా?...."

పరమాశ్చర్యంతో ప్రధాన పరిచారిక నోట మాటే వెలువడ లేదు! తిరిగి సర్వమంగళ ప్రసంగించింది.

"అయినా, ఆయన పరమపదించిన పిమ్మట పది పన్నెండు దివసాలపాటు లోకాచారాలు, మర్యాదలు—అన్ని యథాతథంగా అనుసరించాను! ఆపైన నాకవి బొత్తిగా రుచించక సర్వదా కలకల

లాడుతూ అపూర్వంగా అలంకరించుకుంటున్నాను. దీనిలో నా తప్పిదమేమిటే?"

లవంగిక నిలువునా నిర్ఘాంతపడి, మహారాజ్ఞివైపు కన్నార్పకుండా చూచింది. పూర్వకాలంలో ఆమె ధోరణినిబట్టి, కేవలం భోగాసక్తివల్లనే ఆ తీరులో అనుదినము అలంకరించుకుంటున్నదని అనుకున్నది! ఇప్పుడా ఆలోచన అంతా పూర్తిగా తారుమారయింది. ఆమె విస్ఫారిత నేత్రాలతో రాజ్ఞివైపు చూచింది. అంతలోనే సర్వమంగళ రవంత అనునయ స్వరంతో అందుకున్నది.

"లవంగికా! ఎందుకే అలాగ కళ్ళప్పగించి చూస్తూ ఆశ్చర్యపడతావు! ప్రేముడిలో తెరిగినవారి కిది వివరించవలసిన అవసరమే లేదు! అది తెలియని వారి కిది అంతా అస్తవ్యస్తంగానే కనిపిస్తుంది! అటువంటివారి కెంతగా బోధించినా ప్రయోజనం లేదు! తెలిసిందా?"

అప్పటికి లవంగిక తన ఆశ్చర్యాఘాతంనుండి రవంత తేరుకున్నది. కాని ఆమె పూర్తిగా రాజ్ఞి ఆంతర్యం గ్రహించుకోలేకపోయింది. అయినా చేతులు రెండు జోడించి ప్రగాఢ భయభక్తులతో ప్రణమిల్లింది.

"అమ్మా! బొత్తిగా గ్రహించుకోలేక నేనేమేమో అని మీ మనస్సెంతయినా నొప్పించాను! దయతలచి ఈ దాసి అపచారం మన్నించండి!"

రాజ్ఞి అంతటి అపరాధమేమి లేదన్నట్టు ఒక్క చిరునవ్వు విరజిమ్మింది. అదేక్షణంలో తటాలున ఆ ప్రస్తావన మార్చివేసి, ఎంతో ఆత్రుతతో ఆదేశించింది.

"సరే, దీనికేమిగాని, ఆ దేవాలయ నిర్మాణం సరిగ్గా ఎక్కడ నిలిచిపోయిందో కనుక్కొని వెంటనే నా కది తెలియజెయ్యి! వచ్చే చైత్రపూర్ణిమనాటి కది అంతా ముగిసిపోవాలి. తెలిసిందా? త్వరగా పోయిరా!"

లవంగిక ఆపైన ఒక క్షణమయినా మహారాజ్ఞి కట్టెదుట నిలబడలేదు. వెనువెంటనే అక్కడినించి కదిలి వెళ్ళిపోయింది.

* * *

చైత్రపూర్ణిమ గడిచిపోయినా మహారాజ్ఞి తలపెట్టినట్టు యశస్కరస్వామి దేవాయతనం పూర్తికాలేదు: పైగా ఎక్కడి పని అక్కడే నిలిచిపోయింది: ఆమె వేలకొలది సువర్ణ దీనారా లివ్వజూపి తానై ప్రయత్నించినా, శిల్పులెవ్వరు ఉత్సాహపడి ముందుకురాలేదు: 'అయ్యో! నే నిన్నివిధాల శాయశక్తులా ప్రయత్నించినా పవిత్ర విప్ర వంశీయులు, పరమ ధర్మస్వరూపులు అయిన యశస్కరమహారాజు పేరట ఒక్క దేవాలయం నిర్మించలేకపోతున్నానే!' అని రాజ్ఞి ఎంతో మథనపడింది. ఆమె తీవ్రవేదన కెన్నో కారణాలున్నాయి.

కాశ్మీరంలో యశస్కరుని పరిపాలనం క్రైస్తవ శకం 958 వ సంవత్సరంలో పరిసమాప్తమయింది. అటుపిమ్మట పట్టుమని ఒక ఏడాది అయినా గడవక మునుపే అతని కేదోవిధంగా వారసులయి గద్దెనెక్కిన వర్ణాట సంగ్రాముల నిద్దరిని అతి నిగూఢంగా కుట్రపన్ని తుదముట్టించి, ప్రధానామాత్యుడు పర్వగుప్తుడు అకస్మాత్తుగా కాశ్మీర సింహాసనం స్వాయత్తం చేసుకున్నాడు. ఆ మంత్రి ఉత్తమ కులీనుడు కాడు. పైగా ఒక సాధారణ వ్యవహారలేఖకుని పౌత్రుడు: కాని అసాధారణ వాకచక్యంతో మిగిలిన సచివులనందరిని కూడగట్టుకుని క్రమక్రమంగా రాజ్యాధికారాలన్ని తన గుప్పిట పెట్టుకున్నాడు.

అంత్యకాలంలో యశస్కరునికి మాటిమాటికి ఇక్కట్లు లెన్నో ఎదురువచ్చాయి. ఎడతెగని దీర్ఘరుగ్మతవల్ల, బలహీనతవల్ల అతని అధికారం అంతా పర్వగుప్తుని వశమయింది. త్వరలోనే తన మృతి తప్పదని గుర్తించిన ఆ మహీపతి తనపేరట, యశస్కరస్వామి దేవాలయమన్న ప్రఖ్యాత నామధేయంతో పరమ శివుని కొక దేవళం రూపొందించి సమర్పించవలెనని సంకల్పించుకున్నాడు. స్వయంగా శంకుస్థాపనచేసి నిర్మాణం ప్రారంభింపజేయించాడు. కాని క్రమక్రమంగా ఎడతెగని ఆధివ్యాధులవల్ల దాని పరిపూర్తి తాను కళ్ళారా చూడలేనేమో అని అధైర్యపడి, చిన్నరాణి సర్వమంగళాదేవి కా వ్యవహారం అప్పగించి, అదే ఆలోచనతో సతమతమై మరింతగా కుంగి కృశించాడు.

అపర ధర్మమూర్తి యశస్కరునికి అవసానకాలంలో

తటస్థించిన విపత్పరంపర తలుచుకున్నప్పుడు సర్వమంగళ విపరీత వ్యథతో విలవిలలాడింది. అంతటి మహారాజు రెండువేల అయిదు వందల పైడిదీనారాలొక చిన్న పెట్టెలో భద్రపరుచుకుని, చిట్టచివరి క్షణంలోనయినా ఒక పునీత శైవ మఠంలో ప్రవేశించి ప్రాణపరిత్యాగం చెయ్యవలెనని సంకల్పించుకున్నాడు. తొందర తొందరగా సముచిత పరివారంతో రాజభవంతి నుండి బయటపడి ఆ మఠంవైపు ప్రస్థానం కొనసాగించాడు.

కాని పర్వగుప్తుడు పురికొల్పిన బందిపోటుదొంగ లకస్మాత్తుగా పైబడి, కొల్లగొట్టి ఆ ధనంలోకూడా చాలా భాగం అపహరించారు! తుట్టతుద కెలాగయితేనేమి మఠంలో ప్రవేశించి, కొన్నాళ్ళు జీవించి, ఇక ఊపిరి విడిచే సమయంలో యశస్కరస్వామి దేవాలయం సమగ్ర నిర్మాణమే తన తుదికోరిక అని సర్వమంగళ సమక్షంలో వెల్లడించి, యశస్కరభూపతి అదే ధ్యాసతో పరలోకం చేరుకున్నాడు.

పట్టపురాణి త్రైలోక్య దేవి భర్త చితిలో సహగమనం చేసినప్పుడు సర్వమంగళ “తన కంతటి అదృష్టం కలగక పోయెనే!” అని ఎంతయినా తల్లడిల్లింది. “పోనీ, యశస్కర మహారాజు దేవాగార నిర్మాణ సంకల్పం శిలా రూపంలో సుస్థిరం చెయ్యగల మహాభాగ్యమయినా లభించబోతున్నది గదా!” అని కొంత ఊరట పొందింది.

సర్వమంగళ ఆ మరునాడే అంతఃపురం విడిచి వేరొక సౌధంలో తన నెల వేర్పరుచుకున్నది. పది పదిహేను దివసాలలోనే తిరిగి దేవాలయ నిర్మాణం ప్రారంభింపజేయించింది. ఆమెసహజంగా ఐశ్వర్యవతి. అందువల్ల దేవాలయ నిర్మాణాని కెంతటి ధనరాశి అయినా గుమ్మరించడాని కెంతమాత్రము వెనుదియ్యలేదు!

మొట్టమొదట దేవళం నిర్మాణం కొంత చురుకుగానే కొనసాగింది. ఆ తరువాత అది బాగా మందగించింది. దానికిగల మూల కారణమేమో తెలియక రాజ్ఞి కొన్నాళ్ళు చాలా తికమక పడింది. ప్రధానశిల్పి కోరినంత సొమ్ము వెనువెంటనే సమకూర్చగలనని బాగా

ఆశపెట్టింది. అయినా అతడుకాని, అతని అనుచరులుకాని ఆవంతయినా పనిచేసినట్టు కానరాలేదు! చిట్టచివరి కొకనాడు ఏమి పాలుపోక ప్రధాన పరిచారికతో ఆ సంగతి చూచాయగా ప్రస్తావించింది. లవంగిక ఎంతగా తల బద్దలు కొట్టుకున్నా, దానికేమి కారణమో గ్రహించలేకపోయింది. తుట్టతుద కొక నిట్టూర్పు విడిచింది.

"తామనుగ్రహించిన బహుమానం తిరస్కరించినందువల్ల పర్వగుప్త ప్రభువు లోకవేశ దేవాలయ పరిపూర్తికి అడుగడుగునా అడ్డుతగులుతున్నారేమో!"

"కాని, దీనిలో జాప్యం మొట్టమొదటినించి కొద్దో, గొప్పో ఉన్నదే కదా?"

సర్వమంగళ దానిమీద తన సంశయం వెల్లడించి ఏదో ఆలోచనలో పడింది. లవంగిక కేమనడానికి పాలుపోలేదు. కొంతసేపాలోచించి, చిట్టచివరికి అస్పష్టంగా నసిగింది.

"ఏమోనమ్మా! ఇదంతా చూస్తే నాకేదో అనుమానంగా ఉన్నది! ఇటీవల రాజహంసి ఒకనాడు రహస్యంగా నా దగ్గరికి వచ్చి, "సర్వమంగళాదేవిపై పర్వగుప్త ప్రభువుల అనుగ్రహకటాక్షం ప్రసరించిఉంటే, ఈ దేవళం నిర్మించడాని కింతటి జాప్యం జరిగి ఉండేదేనా?" అన్నట్టు మాట్లాడింది. కాని ఎంతగా తరిచితరిచి అడిగినా ఆమె ఆంతర్యంమాత్రం బయటపెట్టలేదు! తిరిగి ఇంకొక్కమారు వచ్చి అదేమాట రెట్టించింది. ఇంతకి దాని లోలోపలి ఆలోచన ఏమో నా కీనాటికి బోధపడలేదు!

సర్వమంగళ చేతిపై చెక్కిలి ఆన్చి, 'రాజహంసి ఆలోచన ఏమయి ఉంటుందా?' అని కొంతసేపాలోచించింది. అంతలోనే మొలకెత్తుతున్న గద్గదికతో సుదీర్ఘంగా నిశ్వసించింది.

"ఆహా! మహేంద్రవైభవశాలి యశస్కరులే ఈ దేవళానికి స్వయంగా శంకుస్థాపనచేసి త్వరలోనేసంప్రోక్షణంజరిపించాలనిసంకల్పించుకున్నారు! అవసాన కాలంలో అదే తమ తుది అభిలాష అన్నట్టు నోరు విడిచి నన్నర్థించారు! నాకేవిధమయిన కొదవలేదు! అయినా

నేనై కొనసాగిస్తున్న ఈ దేవాలయం ఒక అంగుళంమేరయినా పైకి పోవడంలేదు!"

రాజ్ఞిదైన్యం లవంగిక నెంతో కదిలించివేసింది. ఆమె చెక్కిళ్ళపై బొప్పబిందువు లొక రెండు తరళించాయి. రాజ్ఞి తిరిగి తన మనోవేదన వెళ్ళబోసుకున్నది.

"ఆ మహారాజు నన్నెల్ల వేళల పువ్వులలో పెట్టి పూజ చేశారు! ఒక్కనాడు నా మాట జవదాటలేదు! నాతో సంప్రతించనిదే ఏ రాజ్యవ్యవహారము నిర్ణయించలేదు! కాని ఈ నా డటువంటి పుణ్య మూర్తి తుదికోరికే నెరవేర్చలేకపోతున్నాను! ఇంతకన్న వేరే తలవం పేమి ఉన్నది? నేనిక బ్రతికిఉన్నందువల్ల ప్రయోజనం ఏమిటి?"

రాజ్ఞి కంఠంలో గద్గదిక మరింతగా బరువయింది. లవంగిక చల్లని పలుకులతో ఆమె నోదారుస్తున్నది. అదేసమయంలో సింహ ద్వారంవైపు చూచి, "ఎందుకోగాని రాజహంసి వస్తున్నట్టున్నదే!" అన్నది.

అటుపిమ్మట రాణి అనుమతితో తానే మహారాజ దూతిక నల్లన సమీపించింది. ఇంకేమి విద్దూరం పుట్టగలదో అని సర్వ మంగళ మహారాజు దూతిక రాక సంగతే ఆలోచిస్తూ పరిపరివిధాల మథనపడుతున్నది.

అలాగలాగ ఒక అరగడియసేపు గడిచినా లవంగిక తిరిగి రాలేదు. ప్రాణం విసిగి రాజ్ఞి ఆమె రాకకోసమే నిరీక్షిస్తూ మరింతగా ఆత్రపడింది. మరికొన్ని క్షణాలలోనే లవంగిక తిరిగివచ్చింది. ఆమె ముఖంపై విపరీతమయిన దైన్యచ్ఛాయ అలముకున్నది. కత్తి నాటు వేసినా నెత్తురుచుక్కలేదు! సర్వమంగళ ఆ ధోరణి గమనించి మరిం తగా ఆందోళనపడింది.

"అదేమే లవంగికా, అలాగున్నావు? ఏమిటి విశేషం?"

"ఏమి చెప్పనమ్మా! నా కేమనడానికి నోరు రావడంలేదు."

"మరేమి భయం లేదులే! త్వరగా ఆ రాజహంసి చెప్పినదేదో బయటపెట్టు!"

"మహారాజ్ఞీ! నేనేమని విన్నవించగలను?"

లవంగిక మరి మాట్లాడలేకపోయింది!

"ఎందుకే నీకంత సంకోచం! నేనేదో కొంచెం చూచాయగా గ్రహించుకున్నానులే! ఇక నీకెందుకే ఈ ఆరాటం?"

రాజ్ఞి లీలగా నవ్వి ప్రోత్సహించింది. లవంగిక ఆ దారుణ విషాదవార్త నెమ్మదిగా బయటపెట్టింది.

సర్వమంగళ పర్వగుప్తుని అంతఃపురంలో ప్రవేశించి, ఆతని రాజ్ఞీ గౌరవం స్వీకరించడాని కంగీకరించిన పక్షంలో యశస్కర స్వామి దేవాలయ నిర్మాణం త్వరలోనే ముగిసిపోతుంది. దాని కంగీకరించని పక్షంలో ఆదేవళం వ్యవహారం మరి కొనసాగదు! రాజ హంసి ద్వారా పర్వగుప్త ప్రభువు నిష్కర్షగా పంపించిన అంతిమ సందేశం అది! దాని కిక తిరుగులేదు!

అది ఆలకిస్తూనే సర్వమంగళ కేవలం శిలాప్రతిమే అయింది! అయిదారు నిమేషాలవరకు ఆమెకిక ఊపిరే ఆడలేదు! ఆపైన అక స్మాత్తుగా ఆమె ముఖం చిరు నగవుల తరగల తళ తళలతో కలకల లాడింది!

"లవంగికా! పర్వగుప్తుల వైఖరినిబట్టి ఆయన ఆలోచన ఈ తీరులో కొనసాగగలదన్న అనుమానం నా కిటీవల కలగకపోలేదు! కాని లోకాపవాదాని కొకింత సంకోచించగలరేమోనని ఆశపడ్డాను! పోనీలే, ఇదీ ఒకవిధంగా నా మంచికే వచ్చింది! యశస్కరుల సత్సంకల్పం ఈ విధంగా నయినా సంపూర్ణంగా నెరవేరి తీరుతుంది!"

ఈమారు నిర్ఘాంతపడడం లవంగిక వంతయింది!

"అదేమిటమ్మా, అలాగంటున్నారు! ఇది మీవంటి అభిమాన వతుల నోటినుండి వెలువడవలసిన ప్రసంగమేనా?"

అయినా రాజ్ఞి ఎక్కడ చెక్కుచెదరలేదు!

"లవంగికా! నీ కింతటి ఆశ్చర్యం ఎందుకు కలుగుతున్నదో నాకేమి బోధపడడంలేదు! నాకు ముఖ్యంగా కావలిసింది దేవాలయ నిర్మాణం పూర్తికావడమే! అది సమగ్రంగా రూపొందిన పిమ్మట, దాని సంప్రోక్షణ సమయంలో కట్టకడపటి పూర్ణాహుతి ముగియ

గానే నేను వెనువెంటనే అంతఃపురంలో ప్రవేశించి, పర్వగుప్త ప్రభువుల రాణినవుతున్నానని విన్నవించు: తెలిసిందా!"

లవంగిక 'కలగంటున్నానా? మేలుకున్నానా?' అని క్షణ కాలం వితర్కించుకున్నది. అంతలోనే రాజ్ఞి తిరిగి అందుకున్నది.

"అయితే ఒక్కమాట! పర్వగుప్తులు తమ పట్టమహిషితో సరిసమానంగా గౌరవించగలమని మాట ఇచ్చినప్పుడే నేను వారి కోరిక మన్నిస్తున్నానని విస్పష్టంగా నొక్కి వక్కాణించాలి! ఈ వాగ్దానం మాత్రం తప్పకుండా రాబట్టుకోవాలి సుమా!........ తెలిసిందా?"

లవంగిక మరింతగా విభ్రాంతపడి నిశ్చల నయనాలతో రాజ్ఞి వైపు చూచింది.

"మహారాజ్ఞీ! ఇదేమిటి మీరిలాగ సెలవిస్తున్నారు! నేను విన్నది యథార్థమేనా? లేక, ఒకవేళ పరిహాసాని కిలాగ ప్రసంగిస్తున్నారా?"

సర్వమంగళ ముఖంలో తీవ్రమయిన గాంభీర్యరేఖ తాండవించింది. ప్రధాన పరిచారిక నొక్క నిమిషమయినా మరి తన సమక్షంలో నిలబడనియ్యలేదు!

"లవంగికా! ఇంక నా మాట కద్దు చెప్పకు! దీనిలో యశస్కరుల ఎడల నా కేమీ అపచారం కనిపించడంలేదు! ఈపైన క్షణమయినా దేవాలయ నిర్మాణంలో తామసించడానికి వీలులేదు! తక్షణమే బయలుదేరిపో! నీవే స్వయంగా పర్వగుప్తుల కిది నివేదించు. ఎందుకలాగ సంశయిస్తున్నావు! త్వరగా పోయిరా!"

ఆ విధంగా రాజ్ఞి తన కాళ్ళకింద నిప్పులు పోస్తున్నప్పుడు ప్రధాన పరిచారిక అక్కడ నిలబడలేకపోయింది. మరునిమిషంలోనే, బయలుదేరిపోయి, రాజహంసితో కలిసి పర్వగుప్తుని సందర్శించి, రాజ్ఞి సందేశం యథాతథంగా నివేదించింది.

* * *

అటుపిమ్మట యశస్కరుని పేరట ప్రారంభించిన మహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం త్వరలోనే పరిసమాప్తమయింది. సర్వ

మంగళాదేవిని పట్టపురాణికన్న పదింత లెక్కువ మిన్నగానే అయా మర్యాదలతో గౌరవించగలనని ప్రతిసందేశం పంపించి, పర్వగుప్తుడు సత్వరమే పదివేలమంది పనివారి నేర్పాటు చేయించాడు. అనతికాలంలోనే వివిధ మనోజ్ఞ శిల్పాలతో యశస్కరస్వామి దేవాలయం పరమ రమణీయంగా నిర్మించి తా నన్న మాట అక్షరాల నిల బెట్టుకున్నాడు.

అయితే ఆ నిర్మాణానికి ఒక్క రాగి దీనారమయినా స్వీకరించడానికి సర్వమంగళ అంగీకరించలేదు! ఆ వ్యవహారంలో ఆమె అభిమానము, గట్టి పట్టుదల గమనించి ఆశ్చర్యపడినా, పర్వగుప్తుడు అడ్డు చెప్పి ఆమె మనస్సు నొప్పించదలుచుకోలేదు. కనక మరి ఆ గోడే తలపెట్టక మాట్లాడకూరుకున్నాడు.

వైశాఖ పూర్ణిమనాడు ఏర్పరిచిన దేవాలయ సంప్రోక్షణోత్సవం సమీపించినకొద్దీ సర్వమంగళ సముల్లాసం మరింతగా మితిమీరింది! ఆ ధోరణి లవంగిక కెంతయినా ఆశ్చర్యము, విషాదము, వ్యథ కలిగించింది. శీలవతు లందరిలోను పేరెన్నిక గన్న ఆ రాణి, ఆ విధంగా పర్వగుప్తుని అంతఃపురిలో పట్టమహిషితో సరిసమానంగా తులతూగడంకోసమని, అంతటి ఆవేశంతో అర్రులు చాచడం తలుచుకోగానే లవంగిక శరీరం భరించరాని ఏవగింపుతో జలదరించింది!

"మహైశ్వర్యంతో మదించి మైమరచిన రాణు లెంతటికయినా తగినవారే! వారి పుర్రెలలో ఎప్పు డెటువంటి బుద్ధులు పుట్టుకవస్తాయో ఎవ్వరి కెరుక!....అయినా రాజభోగాలపై మమకారం తెంచుకోవడం అంటే మాటలా? పోనీలే, గొప్ప ఇళ్ళ గొడవల గోడు నా కెందుకు?" అని తనలో తాను సరిపెట్టుకున్నది.

అంతేగాని ఎంతగా సన్నిహితమయిన పరిచయము, చనువు ఉన్నా సర్వమంగళతో ఆమాట ప్రస్తావించడానికే ఇష్టపడలేదు! ప్రతిదినము రాజ్ఞి ప్రాతఃకాలాలంకరణం మాత్రంకేవలం మూగనోముపట్టినట్టు యథాతథంగా ముగించివేసింది.

ఇక రేపు పౌర్ణమి అనగా సర్వమంగళ మరింత సంతోషా

వేశంతో తన అలంకరణ తన్మయతలో తలమునకలయింది. అనా డామె ఉత్సాహానికిక పట్టపగ్గాలే లేవు! దాని కనుగుణంగా శ్రీనగరం పుష్పోద్యాన వనాలతో విరగబూచిన తంగేడువలె విభ్రమిగింది. అది వైశాఖమయినా, ఇంకా పొద్దుటివేళ పొగమంచు పలచబడలేదు. పూలగుత్తులతో ఒరిగిన భూర్జవృక్షాల కొమ్మలమీద తెలతెల్లని నార చీరలలా జీరాడుతున్నది.

పురులు విప్పి ఆడుతున్న రంగురంగుల నెమళ్ళ కేకలతో, వేర్వేరు పెంపుడు పులుగుల కలకలంతో రాజ్ఞి సర్వమంగళ భవంతి ఉద్యానవనం మంద్రమంద్రంగా ప్రతిధ్వనిస్తున్నది. ప్రాతఃకాల కిర ణాల కుంకుమల వెలుగులో ఆ భవంతి అంతా పద్మరాగాలతో మలిచి నట్టుగా విచిత్రమయిన విభ్రాంతి కలిగిస్తున్నది!

అల్లంత దూరంలో యశస్కరస్వామి దేవళంపై గరుడ పచ్చ కలశంవైపు చూచి, గాలిలో కదలాడుతున్న ధ్వజస్తంభం చిరుమువ్వల సవ్వడి వినగానే సర్వమంగళ శరీరం హర్షావేశంతో జలదరించింది! అంతలోనే లవంగిక రాజ్ఞి చరణాల అలంకరణం ముగించి, శిరస్సు వంచుకుని పెలవడిగి, భవంతిలో వేరొక పనిమీద వెళ్ళిపోబోయింది. కాని సర్వమంగళ దాని కనుమతించక, రవంత బొమముడి విరిచి, చెక్కిళ్ళపై చెంగలిస్తున్న చిరునవ్వుతో ప్రశ్నించింది.

"లవంగికా, బొత్తిగా పలుకే బంగారమైపోతున్నదేమే! ఇంత మౌనివైపోతున్నావెందుచేత? ఏమిటే విశేషాలు?"

ప్రధాన పరిచారిక వంచిన శిరస్సు పైకెత్తలేదు! రాణి ఫాల తలిమీద ప్రశ్నార్థకమయిన బొమముడి సడలలేదు! లవంగిక కాపైన మౌనం మర్యాద అనిపించలేదు.

"మహారాజ్ఞీ! మీరింక పర్వగుప్తుల అంతఃపురానికి అలం కారమై పట్టపురాణితో సరిసమానంగా తులతూగడంకన్న వేరొక గొప్ప విశేష మేమిఉన్నది! శ్రీనగరంలో ఎక్కడవిన్నా ఇదేమాట! ఇది మీకు తెలియదా, ఊరికే నాచేత వాగిస్తున్నారుగాని!"

ఆమె సమాధానంలో వ్యంగ్యాధిక్షేపం సర్వమంగళ గుండెలో

సునిశితమయిన శూలాగ్రంలా సూటిగా దూసుకుపోయింది! అయినా రాజ్ఞి కలకల నవ్వింది. ఆమె కర్ణాభరణా లటు, ఇటు చెంగ లించాయి.

"దీనితో యశస్కారుల సంకల్పం సంపూర్ణంగా సిద్ధిస్తున్నప్పుడు, అంత ఆడిపోసుకోదానికి తగిన అపచారమేమి నాకు గోచరించలేదే?"

ఆ ప్రశ్నతో లవంగిక ఊపిరి నెమ్మదిగా నిలిచిపోయింది! మరింతగా విప్పారిన విలోచనాలతో రెప్పపాటయినా లేక రాజ్ఞివైపు చూచింది! అంతేగాని పెదవి కదపలేకపోయింది! కాని సర్వమంగళ అధరంపై చిన్నారి చిరునవ్వు మొలకెత్తింది.

"లవంగికా! ఎందుకలా ఆశ్చర్యపోతావు? అనుశాసనిక పర్వంలో మహా పతివ్రతామతల్లి ఓఘవతిగాథ ఎప్పుడయినా విన్నావా?"

లవంగిక ఆ ప్రశ్న విని రవంత అదిరిపడింది.

"ఏమోనమ్మా! మిగిలిన పర్వాల కథలన్ని విన్నానుగాని, నే నా అనుశాసనిక శాంతిపర్వాల ధర్మగాథ లెన్నడు విననేలేదు! ఎందుకలాగ అడుగుతున్నారు?"

"సామాన్యంగా అందరు ఆ పర్వాలంటే అంతగా పట్టించుకోరులే! అనుశాసనిక పర్వంలో ఒక విచిత్రమయిన కథ ఉందిలే! అది కొంచెం చెబుతాను విను.

"పూర్వకాలంలో సుదర్శనుడనిమహారాజు ఒకడుండేవాడు. ఆయన కొంతకాలం రాజ్యం పరిపాలించి, ఆపైన ఇల్లాలిని వెంటబెట్టుకుని అరణ్యంలో నిర్మించుకున్న ఆశ్రమంలో నివసించాడు. ఆ సమయంలో ఆతిథ్య ధర్మనిర్వహణమే ఒక గొప్ప తపోదీక్షగా స్వీకరించి ఏకాగ్రనిష్ఠతో నిర్వర్తించాడు. ఓఘవతి ఆయన ధర్మపత్ని."

"అయితే ఆ ఇల్లా లేమి చేసింది?"

లవంగిక ఎంతో ఆత్రతతో ఆ మాట కడ్డుపడి అడిగింది.

"అదే చెబుతున్నాను, విను! అతిథులంటే సుదర్శనునికి

కేవలం దైవస్వరూపులే! ఆయన ఆతిథ్యదీక్ష కేవలం అసిధారా వ్రతమే! "ఆ అతిథు లెవ్వరయినా ఒకవేళ ఓఘవతి చక్కదనాని కెంతో అక్కజపడి, ఉవ్విళ్ళూరి అభిలాషపడినా. ఆ కోరిక అవశ్యం నెరవేర్చి తీరవలసిందే!" అని ఆయన ఆ పుణ్యశీల కాదేశించాడు!"

"కథ చాలా విడ్డూరంగా ఉన్నదే!"

లవంగిక పట్టరాని ఆశ్చర్యంతో తలమునకలయింది.

"కొసకంటా వింటే నీవు మరింతగా ఆశ్చర్యపోతావు! ఆ పతివ్రతాతిలకం భర్త ఆనతి సరిగా అలాగే శిరసావహించింది. సుదర్శను డొకనాడు అరణ్యంలో సమిధలకోసం వెళ్ళినప్పుడు, ధర్మదైవతమే అతిథిగా వచ్చి, ఓఘవతి ఆతిథ్య ధర్మనిష్ఠ పరీక్షించాడు. ఆ దంపతుల కఠోర దీక్షానిర్వహణ కెంతో ఆనందించి, సశరీర స్వర్లోక నివాసమే వరంగా అనుగ్రహించాడు. అంతేకాదు. ఆ మహనీయ వరప్రభావంవల్ల ఓఘవతి నేటికి పుడమిపై ఒక పునీత నదీమతల్లిగాకూడా ప్రవహిస్తున్నది!"

మొట్టమొదట ఆ గాథ ప్రారంభించినప్పుడు రాజ్ఞి అది ఎందుచేత ప్రస్తావిస్తున్నదో లవంగిక కవగాహన కాలేదు! అది ముగించగానే ఆమె ఆంతర్యం తటాలున స్ఫురించి. మరింతగా ఆశ్చర్యపడింది. అంతలోనే సర్వమంగళ తిరిగి ప్రస్తావించింది.

"మరి ఓఘవతి ఆ విధంగా భర్త ఆతిథ్య ధర్మనిర్వహణ కోసం తన శీలమే సమర్పించి పతివ్రతా శిరోమణి అని ప్రశంస లందుకున్నప్పుడు, యశస్కరుల దేవాలయ నిర్మాణ దీక్షకోసం నేను నా శరీరం సర్వగుప్తుల అభిలాషాగ్నిలో సంపూర్ణాహుతిగా సమర్పిస్తే దీనిలో తప్పేమిటి? అధర్మమేమిటి? ఎందుకలాగ కళ్ళప్పగించి చూస్తావు?"

సర్వమంగళ తీవ్రంగా బొమముడి విడిచి సూటిగా ప్రశ్నించింది. లవంగిక దాని కేవిధంగాను తిన్నగా సమాధానం చెప్పలేక తికమకపడింది.

మహారాజ్ఞీ! మీరు సాక్షాత్తు అపర సరస్వతీమూర్తి అనిపించుకున్న మహేశ్వర భట్టారకుల వంశంలో అవతరించారు! వారివద్ద

సకలశాస్త్రాలు కూలంకషంగా మథించి, ఆయనతో తులతూగగల విదుషీమణి లనిపించుకున్నారు. ఆపైన విద్యాఖని యశస్కరుల చిన్నారి రాణులయినారు. ఇటువంటి మీతో నేను ధర్మాధర్మాల చర్చ జరపగలనా! అయితే నా కొక్క చిన్న సంశయం కలుగుతున్నది."

"దానికేమి? ఆ సందేహమేదో బయటపెట్టు! నాదగ్గిర నీకింత సంకోచమెందుకు?"

రాజ్ఞి భయమేమి లేదని భరవసా ఇచ్చింది. లవంగిక తిరిగి నివేదించింది.

"అమ్మా! ఆయా దేశ కాలాలనుబట్టి ధర్మపద్ధతి మారిపో తున్నది కదా! అటువంటప్పుడు మహాభారతంలో ప్రవచించిన పురా తన యుగాలనాటి ధర్మం మన మిప్పు డనుసరించగలమా? అది న్యాయమేనా? నేను బొత్తిగా శాస్త్రవాసన లేని అజ్ఞురాలను.మీ రిచ్చిన చనువు పురస్కరించుకుని, మిడిమిడి జ్ఞానంతో నా సందేహం వెల్ల డించుకున్నాను. అపరాధం మనసారా మన్నించవలసిందని వేడు కుంటున్నాను.

సర్వమంగళ ప్రధాన పరిచారికవైపు నిశితంగా చూచి, శిర స్సల్లన పంకించింది.

"నీ వడిగిన ప్రశ్న చాలా లోతయినదే! నీవేమి అజ్ఞురాలవు కాదులే!....అయితే ప్రజానీకం ధర్మం నిర్ణయించి,దానిని సంరక్షించి ఆచరింపజేయించే వా రెవ్వరే?"

లవంగిక రవంతసే పాలోచించింది.

"మహారాజులేనమ్మా! ఎందుకిలాగ అడుగుతున్నారు?"

"అయితే మహా ధర్మాత్ములయిన యశస్కరుల అనంతరం న్యాయంగా ధర్మం నిర్ణయించదగినదానను నేనే కదా! నా నడవడిక అధర్మమని ధిక్కరించగల అర్హు లెవ్వరే? ఆ సనాతన ధర్మ సంరక్షకు రాలను నేనే కదా!

లవంగిక ఆ ధర్మసూక్ష్మం విని ఉక్కిరి బిక్కిరి అయి దాని కేవిధంగాను ప్రతిసమాధానం చెప్పలేకపోయింది. కాని రాజ్ఞి యుక్తి చాకచక్యంకాని, నిర్ణయంకాని ఆమె కొకింతయినా సరిపడలేదు.

అత్యంత వినయంతో చేతులు కట్టుకుని నిలిచి, నమస్కరించి తన అజ్ఞత మన్నించక తప్పదని బ్రతిమాలుకున్నది.

"అమ్మా! మీ ఎదట నిలిచి నోరెత్తడానికి నేనెంతటి దాన్ని! మీ ఎడల బయలుదేరిన లోకనింద భరించలేక, ఏదో తెలియక నాలుగు మాట లన్నాను. నా తప్పిదం క్షమించండి."

"అయితే పామరులేనా ధర్మనిర్ణేతలు?" రాజ్ఞి కన్నుసని ప్రశ్నించింది. ఆపైన రవంతసేపేదో తీవ్రంగా ఆలోచించి, తన సరసనే శ్రుతి చేసిన వీణ అందుకుని, క్రమక్రమంగా పెంపొందుతున్న గానపారవశ్యంతో, ఆనందాతిశయంతో మేళవించి మైమరిచింది.

లవంగిక అటు పిమ్మట వేరొక విధి నిర్వహణకోసం భవంతి లోపలికి వెళ్ళిపోయింది. ఆయా గృహకృత్యాలేవో నిర్వహిస్తున్నదన్న మాటేగాని, రాజ్ఞి తన నిశ్చయం సమర్థించుకోవడంకోసం చేసిన విపరీతమయిన వితండవాదాన్ని గురించే ఆమె అనేకవిధాల గుంజాటన పడసాగింది. మరికొంతసేపటి కామెలో, యశస్కర మహారాజు మరణించిన పిమ్మట రాణి నడవడిలో గల అంతరార్థం అంతా మంచు విడిపోయినట్టు విస్పష్టమయింది!

సర్వమంగళ మొట్టమొదట మహారాజుతో సహగమనంకోసం తహతహలాడిన సంగతి ఆమె కిప్పుడు జ్ఞప్తికి రాకపోలేదు! కాని ఆ సమయంలో వెల్లుబికిన శోకావేశంతో ఆమె తాత్కాలికంగా ఆ విధంగా ఆవేశపడి ఉండవచ్చునని ఊహించింది. ఆ తరవాత యశస్కరస్వామి దేవాలయం పూర్తికావాలన్న మిషతో ఆ వ్యవహారం రాజ్ఞి చల్లచల్లగా దాటవేసి ఉండవచ్చునని కూడా ప్రధాన పరిచారిక పసికట్టింది.

ఆపైన నూతన వధూవేషంతో కలకలలాడడంలో గల పరమార్థంకూడా లవంగిక కవగతమయింది! తన హృదయంలో సర్వదా వెలుగొందుతున్న భర్త తేజోమూర్తి ఎడల ఏర్పడిన గౌరవంతో అలాగ అలంకరించుకుంటున్నానని రాజ్ఞి వివరించిన సంగతి ఆమె మరిచిపోలేదు. కాని అది అంతా తనని మభ్యపెట్టడంకోసమే అని లవంగిక కిప్పుడు తటాలున స్ఫురించింది.

"అయితే పర్వగుప్తుల పదివేల సువర్ణ దీనారాల బహుమానము ననేమిరా కాదని తిరస్కరించడాని కేమిటి చెప్మా కారణం?" అని ప్రధాన పరిచారిక రవంతసేపు వితర్కించుకున్నది. 'ఆ, అది అంతా పట్టి బెట్టుసరి! ఆహా! మహారాణి ఎంతటి నెరజాణ!" అని దానికి గల కారణం గ్రహించుకుని ఆశ్చర్యపడింది. ఆపైన తాను చేస్తున్న అకృత్యం సమర్థించుకోవడంకోసం సర్వమంగళ ఓఘవతిగాథ ఉట్టంకించడం లవంగిక కన్నింటికన్న ఒక పెద్ద విడ్డూరంగా గోచరించింది.

కాని మరికొంతసేపటికి "ఆఁ, దీనిలో అంత వింత ఏమి ఉన్నది? మనుషులు తాము తలపెట్టిన పని ఎంత కానిదయినా చేసి తీరాలని ముమ్మొందుగా నిశ్చయించుకుంటారు! ఆపైన లేనిపోని ధర్మపన్నాలతో, కుతర్కాలతో, కారణాలతో అది సమర్థించుకుని, తమ వంటి సచ్చరిత్రులు లేరని విర్రవీగుతారు!" అని సమాధానపడింది.

తా నెరిగినంతవరకు కాశ్మీరంలో అంతటి సౌశీల్య సంపత్తితో చల్లని ఇల్లాలని పేరెన్నికగన్న మహారాజ్ఞి కొండంత పెనిమిటి కన్ను మూయగానే ఆనాటికానాటికి అలాగ దిగజారిపోవడం లవంగిక కెంతయినా మనఃఖేదం కలిగించింది. కాని అంతలోనే 'అసలే ఐశ్వర్యవంతురాలు. ఆపైన సౌందర్యవతి. ఆపైన వయస్సు ముమ్మరంలో ఒంటరితనంకూడా తోడయింది! ఇక ఏమి కావాలి! మరి పట్టపగ్గా లుంటాయా!....అయినా నా కెందుకీ లేనిపోని గొడవ! లోకం తీరే అంత! నే నిలాగ నెమ్మదిగా కాలక్షేపం చేసుకుపోగలిగితే అదే పదివేలు!' అని సరిపెట్టుకుని, ఇంక ఆ గోడే తలపెట్టకూడదని నిశ్చయించుకున్నది.

* * *

ఆ మరునాడు తెలతెల్లవారగానే సర్వమంగళాదేవి పేరట యశస్కరస్వామి దేవాలయ సంప్రోక్షణ మహోత్సవం యథావిధిగా ప్రారంభమయింది. పురోహితుల వేదమంత్రాల ఘోషలతో, స్వాహా

కారాల హోరులతో సంప్రోక్షణ హోమశాల భోరుమని మారు మ్రోగింది.

సర్వమంగళ ఆనాడు సమస్తాభరణాలతోను మరింత సమ్మోహనంగా, జాజ్జ్వల్యమానంగా వెలిగిపోతున్నదని ప్రధాన పరిచారిక ఆశ్చర్యపడింది. కాని ఆనా డెందుచేతనో ఆమె అంత ఉల్లాసంగా ఉన్నట్టు కనబడలేదు! అయితే లవంగిక అపూర్వంగా అలంకరణం ముగించి, కయిదండ అందించి, బంగారుపూతతో నిర్మించిన నిలువుటద్దం ముందు నిలిపిన పిమ్మట ఆమె పొగడ్త విని రాజ్ఞి ఆనందం పట్టలేక, "లవంగికా, నిజంగా నే నీ నా డంత అందంగా ఉన్నానా?" అని పసిబాలికలా ఎంతో అమాయికంగా ప్రశ్నించింది.

ఉవ్వెత్తుగా ఉప్పొంగిన నిండుగుండె నడుమ నలిగిపోతున్న ముత్యాలహారాలతో, ముంగురులపై వేలాడుతున్న రతనాల జాలరులతో, చిలకపచ్చ పట్టు చీరతో తరళిస్తున్న సర్వమంగళ శరీరశోభ గమనించిన లవంగిక కనురెప్ప లలాగే నిలిచిపోయాయి!

"మహారాజ్ఞీ! సర్వగుప్త ప్రభువులపై నేడు నిశ్చయంగా భాగ్యదేవత పరిపూర్ణ కటాక్షం ప్రసరించింది! మరి సందేహంలేదు! ఆహా! ఎప్పటికి, ఎవ్వరికి, ఎటువంటి అదృష్టం పట్టగలదో ఎవరు చెప్పగలరు!"

సర్వమంగళ లీలగా నవ్వింది.

"అవును! నీ వన్నది నిజమే! ఎవరి అదృష్టం ఎప్పటి కెలాగ పరిణమించగలదో ఎవరు చెప్పగలరు? నే నీ దేవాలయ నిర్మాణం ఇంత శీఘ్రంగా ముగించగలనని అనుకున్నానా?"

అదేసమయంలో అనతిదూరంలో యశస్కరస్వామి దేవళాని కెదురుగా నిర్మించిన హోమశాలనుండి సంప్రోక్షణ మంత్రాల గభీర ఘోష క్రమక్రమంగా అత్యధికమై నలువైపుల వ్యాపించింది.

తా నిక ఆ శాలలో ప్రవేశించి, సంప్రోక్షణ ముగియగానే పూర్ణాహుతి సమర్పించవలసిన సమయం సమీపిస్తున్నదని సర్వమంగళ రవంత ఆత్రపడింది.

మరి ఆలసించక వెనుదిరిగి తన భవంతిలో నలువైపుల

పొరాడింది. తా నెంతో ఆప్యాయంగా పెంచిన పెంపుడుపులుగుల పంజరాలు సమీపించి, పక్షుల నన్నింటిని పలకరించి మనస్సులో సెలవు తీసుకున్నది. ఉద్యానవనంలో పూలతీవ లన్నిటి దగ్గిరికి పోయి అలనల్లన అంగుళులతో స్పృశించి ఎంతో ఆప్యాయతతో వీడ్కొన్నది. వేర్వేరు బంగారు పంజరాలలోనుండి పిలుస్తున్న రామ చిలుకలతో, మైనా గోరువంకలతో ముచ్చటలాడి, అణగించివేసు కున్న కన్నీటితో భవంతి ప్రాంగణంలో ప్రవేశించింది.

కొనగోటితో ఒకటి రెండు కన్నీటిబిందువులు తుడుచుకుని, లవంగికవైపు తిరిగి, "మన మిక బయలుదేరి పోదామా?" అని నిగ్రహించుకున్న డగ్గుత్తికతో హెచ్చరించింది.

లవంగిక ఆమె వైఖరిలో ఇటీవల ఎన్నడు పొడకట్టని గభీరత గమనించి ఎంతయినా ఆశ్చర్యపడింది. వెనువెంటనే కయి దండ అందించి, ఆమె ననుసరించింది. రాజ్ఞి వీడ్కోలు ధోరణిని బట్టి ఆమె పూర్ణాహూతి ముగియగానే అదే శుభముహూర్తంలో బయలుదేరి తిన్నగా పర్వగుప్తుని అంతఃపురానికి తరలిపోగలదేమో అని అనుమానించింది. భవంతిలో పులుగుల కన్నింటికి ఆ తీరులో వీడ్కోలు చెప్పడానికంతకన్న వేరే కారణమేమి కనబడలేదు.

అందుచేత సర్వమంగళ భవంతి సింహద్వారం సమీపించ బోయే తరుణంలో నెమ్మదిగా కయిదండనుండి తొలగి, ఎదురుగా వచ్చి అలతినగవుతో దోసిలికట్టి విన్నవించింది.

"మహారాజ్ఞీ! మీ రా పూర్ణాహూతి ముగియగానే తిన్నగా అక్కడినించే పర్వగుప్తుల రాణివాసంలో ప్రవేశించేటట్టున్నారు. ఇక నే నిక్కడే ఈ భవంతి కనిపెట్టుకుని ఉండిపోక తప్పదు కదా! పర్వ గుప్తుల భవనంలో ప్రవేశించినప్పుడు నావంటి దాసి కింక మీ దర్శనం లభించదేమో! కనక ఇప్పుడే విన్నవించుకుంటున్నాను. రాణి వాసంలో ప్రవేశించిన పిమ్మట ఈ చిరకాల చరణదాసి మాట రవంత గుర్తుంచుకోవలసిందని కోరుకుంటున్నాను."

సర్వమంగళ పెదవులపై జాలితో చిక్కబడిన చిరునవ్వు తొణికిసలాడింది.

"అయ్యో! వెర్రిదానా. ఎంతమాటన్నావు! ఇక నీ మాటే తల పెట్టననుకున్నావా? ఇంతేనా, నీవు నన్నవగాహన చేసుకున్నది? నీ బ్రతుకుతెరువులో ఏవిధమయిన కొదవ కలగకుండా నే నింతకు మునుపే అన్ని ఏర్పాటులు చేసివేశానులే! దీనికి నీవేమాత్రము ఆందోళన పడనక్కరలేదులే!"

ఆ ఔదార్యమూర్తి ఆత్మీయత గ్రహించుకుని లవంగిక అనవసరంగా ఆత్రపడినందు కెంతో నొచ్చుకున్నది.

"మీ కరుణార్ద్రహృదయం లోతెంతటిదో నే నాకళించుకోలేక పోయానమ్మా!"

ఉప్పొంగుతున్న గద్గదికతో మన్నించవలసిందని బ్రతిమాలుకున్నది.

రాజ్ఞి వదనంపై తిరిగి తరళ దరహాసరేఖ తాండవించింది!

ఆమె మరి ఆలసించలేదు! రాజ పరిచారికలు కొందరు భవంతి ముందుంచిన ముత్యాలజాలరుల పల్లకీలో ప్రవేశించింది. అది సత్వరమే బయలుదేరి హోమశాలవైపు సాగిపోయింది. లవంగిక దానిననుసరించింది.

మహారాజ్ఞి పల్యంకిక యజ్ఞశాల ద్వారం సమీపించగానే పర్వగుప్తుని అంతఃపుర పరిచారికలు కొందరు దానిచుట్టు పరివేష్టించారు. వారిలో ప్రధాన పరిచారిక మహనీయ మర్యాదలతో గౌరవించి, సర్వమంగళ సరసనే నిలిచి, ఉట్టిపడుతున్న అడకువతో కయిదండ అందించింది.

మహారాజ్ఞి నాలుగయిదు అడుగులు వేసి హోమశాలలో ప్రవేశించగానే అగ్నుల చుట్టు చేరిన రాజ పురోహితులుతక్క సభాస్తారులందరు దిగ్గునలేచి నిలుచున్నారు!

పర్వగుప్తుడు ప్రధాన సచివునితో తదితర మంత్రులతోబాటు రాజ్ఞి కెదురుగా పోయి, పట్టలేని ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయి, ఇనుమడించిన గౌరవంతో, ప్రగాఢాత్మీయతతో ఆదరించి తన కనతి దూరంలో ఒక సమున్నత స్వర్ణసింహాసనంపై విజయం చెయ్యవలసిందని ప్రార్థించాడు.

సర్వమంగళ సంతోషప్రఫుల్లవదనంతో, రవంత వాల్చిన కనురెప్పలతో వారందరిని నమస్కృతులు ఒక మర్యాదాక్రమంలో అందుకున్నది.లీలగా పైకెత్తిన అరచేతి సంజ్ఞతో వారందరిని వారించి లవంగికతో కలిసి ఆ హోమశాల కెదురుగా ఉన్న యశస్కరస్వామి దేవళంలో ప్రవేశించి, ఆ పరమేశ్వరమూర్తికి వేదోక్త విధిలో పూజలాచరించింది.

అవి ముగియగానే తీర్థ ప్రసాదా లందుకుని, గర్భాలయాని కివతల ఒకవైపున పద్మరాగ వేదికపై స్ఫటిక శిలారూపంలో అంజలి ఘటించినట్టు మలిచిన యశస్కర మహీపతి పాదాలపై వాలి, సాష్టాంగ నమస్కారం సమర్పించి వేడివేడి కన్నీటిధారతో అభిషేకించింది.

లవంగిక కా సంఘటన కొంత విభ్రాంతి కలిగించకపోలేదు. అయితే గతకాలంనాటి మనోహరానుభూతు లేవేవో తవ్వుకున్నందు వల్ల ఆమె కా సమయంలో అంతటి దుఃఖోద్వేగం కలిగిఉండవచ్చు నని ఊహించింది.

మహారాజ్ఞి లవంగిక కయిదండ అందుకుని నెమ్మదిగాలేచి నిలిచింది. ప్రధాన పరిచారిక తన చీరచెరగుతో ఆమెకన్నీ రొత్తి చిందరవందరయిన ముంగురులు కొంచెం సరిచేసింది. ఆ క్షణంలో రాజ్ఞి ముఖంలో తరళ దరహాసంతో అమందానందం విశృంఖలమై నర్తించింది. అప్పటికి తన దేవాలయ నిర్మాణ సంకల్పం సంపూర్ణంగా ఫలించినదని సర్వమంగళ కెంతో సంతృప్తి కలిగినదని లవంగిక భావించింది.

రాజ్ఞి తిరిగి ప్రధాన పరిచారికపై హేలగా ఆనుకుని సంప్రోక్షణకాలలో హోమవేదిక కెదురుగాపోయి అగ్నిదేవునికి ప్రగాఢ భక్తితో నమస్కరించి నిండుదోసిలి కట్టి నిలుచున్నది. లవంగిక రవంతదూరంగా తొలగి మిక్కిలి అణకువతో శిరస్సొకించుక వంచు కున్నది. ఆ సమయంలో ఆజ్యధూమం పలచ పలచగా ఆ హోమ శాలలో అంతట వ్యాపించి, కమ్మని సువాసనలతో ఆకుపచ్చని తోర ణాలలో అలముకుని లీలగా సుడులు తిరుగుతున్నది.అప్పటికే సదస్యు లందరు ఆ మహోత్సవ పరిసమాప్తికోసం నిరీక్షిస్తున్నారు. దేవా

బయ సంప్రోక్షణం యథావిధిగా అంతకుముందే ముగిసింది. మహా రాజ పురోహితు డటుపిమ్మట పూర్ణాహుతి ద్రవ్యాలు ముమ్మారు రాజ్ఞి హస్తంలో ఉంచి హోమం చేయించవలసి ఉన్నది. దానితో ఆ మహోత్సవం పూర్తిగా పరిసమాప్తం కాగలదు!

అదే సమయంలో మంగళతూర్యారావం నలుప్రైపుల చెల రేగింది. ప్రధాన పురోహితుని గళస్వరంతో తమగొంతులతో ఏకీభ వించి మిగిలిన యాజ్ఞికులందరు గభీరస్వరాలతో సభాంగణం భోరు మని మారుమోగి పోయేటట్టుగా ఒక్కమారుగా వేదమంత్రా లుచ్చ రించడం ప్రారంభించారు. వారి స్వాహాకారాల సాగరఘోషతో సభాస్థలి యావత్తు ప్రతిధ్వనించింది. ప్రధాన పురోహితుడు సమంత్ర కంగా తన దోసిలిలోఉంచిన హోమద్రవ్యంతో సర్వమంగళ మొదటి పూర్ణాహుతి ముగించింది. పావకజ్వాల ఆ హోమంతో భగ్గు మని ప్రజ్వలించి ఉవ్వెత్తుగా పైపైకి లేచింది!

ఆ కీలల వెలుగులలో సర్వమంగళ ముఖం లవంగిక కంతకు ముమపెన్నడు లేని అతిలోక సౌందర్యంతో, రాజసంతో, ఆనం దంతో, గాంభీర్యంతో జాజ్వల్యమానంగా వెలిగిపోతున్నట్టు పొడ కట్టింది! ఆమె కా అనుభూతితో మరికొంతసేపటివరకు శరీరంమీది స్పృహే సడలిపోయింది!

తిరిగి స్వాహాకారాల సవ్వడి మంగళతూర్యాల సాంద్ర ఘోషతో కలిసి సదస్యులందరి హృదయాలలోను భోరుమని మారు మోగింది. సర్వమంగళ తిరిగి ఆహుతిద్రవ్యాలతో తన దోసిలి నిండ గానే కలకల నవ్వుతున్న కన్నుగవ పైకెత్తి ఒక్కమారు సభ్యు లందరి వైపు చూచింది. ఆ సమయంలో పర్వగుప్తుని చూపామె వీక్షణంతో క్షణకాలం మేళవించింది. మరునిమేషంలోనే కనురెప్ప లొక్కమారుగా వంచివేసుకుని సర్వమంగళ రెండవ ఆహుతి ముగిం చింది.

ఆమె నిశ్చలదృష్టి తనపై ప్రసరించినంతలోనే పర్వగుప్తుని

శరీరం పరవశించి గగుర్పొడిచింది! ఇక ఒకేఒక్క పూర్ణాహుతితో ఆ రాజ్ఞి తన శయ్యాగృహాని కొక అపూర్వాలంకారం కాగలదని అతడుప్పొంగిపోయాడు!

ఆనాడు కాశ్మీరాధిపతి మహారాజ లాంఛనాలన్నీ అత్యంత జాగరూకతతో అలంకరించుకుని, ఆ హోమాగ్నుల కనతిదూరంలో ఒక సమున్నత సింహపీఠంపై సమాసీనుడై ఏకాగ్రదృష్టితో సర్వమంగళ సంతోష వైఖరి గమనిస్తున్నాడు. అప్పటి కతనికి ఇంచుమించుగా అయిదుపదుల వయఃపరిణామం పైబడింది. కుంకుమపువ్వుతో మెదిపిన సుగంధద్రవ్యంతో గుబురుగా పెరిగిన తన బవిరిగడ్డంలో నెరిసిన వెంట్రుక లేవీ కానరాకుండా అత డెంతో జాగరూకత వహించాడు. కొంచెం శుష్కించిన కోలముఖంతో, కొట్టవస్తున్న గట్టిపట్టుదల గూడుకట్టిన గుండ్రని తేనెకన్నుల ఎర్రజీరలలో దాగిన క్రౌర్యంతో అత డెంతెంతటివారినయినా ఇట్టే హడలెత్తించగలడు!

కండలుతేరిన అతని చామనఛాయ శరీరంపై సరిగంచు చీనాంబరంపాదాలపర్యంతముజీరాడుతున్నది.స్వచ్ఛమైనస్ఫటికంవంటి తెల్లని అంగీపై, పాలనురుగువంటి ఉష్ణీషంపై పొదిగిన మణులు, ముత్యాల జాలరులు అనుక్షణము ప్రతిఫలిస్తున్న వహ్నికీలల తళత్తళలతో మరింతగా తరళిస్తున్నాయి.

ఆ మహోత్సవంలో సర్వగుప్తుని సంతోష పారవశ్యానికనేక హేతువు లున్నాయి. అత డెంతోకాలంనించి సర్వమంగళ చక్కదనం గమనించి మరులుకొన్నాడు. అయినా తన కోరిక ఫలించగలదన్న ఆశాదీపిక అతని కెక్కడ కనుచూపుమేరలో చూచాయగానయినా స్ఫురించలేదు! ఆమె సహజంగా సౌందర్యవతి! గొప్ప ఐశ్వర్యవతి! అత్యద్భుత పాండిత్యంతో యశస్కరునివంటి మనీషి మన్ననలే అందుకున్న రాజనీతి విశారద! పరిపూర్ణ ప్రౌఢ యౌవనవతి. అటువంటి సుందరీమణిపై తన అభిలాష చిట్టచివరికి పట్టి పగటికలే

కాగలదని అతడెన్నోమారులు నిరాశచేసుకున్నాడు! అయినా విసిగి పోక తిరిగి తిరిగి తన యావచ్ఛక్తి వినియోగించి ప్రయత్నించాడు!

తుట్టతుద కొకనాడు యశస్కరస్వామి దేవళం ముగియగానే రాణివాసంలో ప్రవేశించగలనన్న ఆమె ప్రతిసందేశం చెవిని పడగానే అప్పుడే కాశ్మీరరాజ్య లక్ష్మి సంపూర్ణంగా తన కైవసమయినదని అతని కనిపించింది! మిగిలిన గొప్పదనాలన్నిటికన్న సర్వమంగళ సౌశీల్య సౌందర్యమే అతని నెక్కువగా ఆకర్షించి గుండెల కురిపోసి బిగించింది! అటువంటి సర్వమంగళ ఆనాడే తన అక్కున జేరబో తున్నదని తలుచుకుని తలుచుకుని మైమరిచి 'అహో! ఈరాణి ఎన్నెన్ని విధాలనాగుండె పిండి నమిలిమింగివేసింది!ఎన్నెన్నివిధాల బెట్టుసరిచేసి తన పట్టుదల నెగ్గించుకున్నది! ఎంతటి లోతయిన రాజనీతిచాతు ర్యము' అని పట్టరాని ఆశ్చర్యంతో నిశ్చేష్టితుడై ఉసూరుమని నిశ్వ సించాడు. చిట్టచివరి కావిధంగానయినా అఖండ విజయం సాధించి నందుకు తన్ను తానే మెచ్చుకున్నాడు!

పెనుకదలి ఉప్పెనవలె ప్రతిధ్వనిస్తున్నస్వాహాకారాల ఘోషల మధ్య సర్వమంగళ తన దోసిట నిండిన మూడవ పూర్ణాహుతి తిరిగి అగ్నిదేవుని కర్పించి భక్తి పారవశ్యంతో కనుదోయి ఒకింత ముకు ళించింది. ఆ క్షణంలో నలువైపుల వ్యాపిస్తున్న జ్వాలలతో, ఒళ్లెర గని పారవశ్యంతో పావకదేవుడే ఆ అపూర్వ సౌందర్యవతిని కౌగ లించుకో బోతున్నట్లు ప్రజ్వలిస్తున్నాడని పర్వగుప్తుడు రవంత అసూ యతో తనలో తాను భావించుకున్నాడు!

అంతలోనే ఆ మహారాజ్ఞి ఆ జ్వాలల కొకింత దూరంగా తొలిగింది. కన్నులు రెండు ముకుళించుకుని ముమ్మారు ప్రదక్షిణా లాచరించి, భక్తి తన్మయతతో, ప్రశాంతితో కేవలం శిలామూర్తిలా నిలుచున్నది.

మరునిమేషంలోనే "యశస్కర మహేశ్వరాయస్వాహా!" అని తన్నుతానే సంపూర్ణాహుతిగా సమర్పించుకుని ఒక్కమారుగా పైకెగిరి ఆ మహాగ్నికీలలో దూకింది!

ఆ చుట్టు పరివేష్టించిఉన్నవారందరి నోళ్ళనుండి ఒకేమారుగా భయంకర హాహాకారం వెలువడి ఘోరమని ప్రతిధ్వనించింది! అంత లోనే పురోహితుల పునీత హస్తాలనుండి వెలువడిన సురభిళ పుష్ప వృష్టి ఆ రాజ్ఞిపై పడి అగ్నిజ్వాలలలో అదృశ్యమయింది! అదేసమ యంలో సదస్యులనేకులు రాజుకుంటున్న రోషావేశాలతో పర్వ గుప్తునివైపు చూచి, హుంకరించి చేతులెత్తి నోరారా దూషించి అనేకవిధాల దారుణంగా శపించారు!

లవంగిక తన కన్నులే నమ్మలేకపోయింది! పరమపాపి పర్వగుప్తుని కన్నుగప్పి, దేవళం నిర్మించి, ఆతనికి చేజిక్కని తన పవిత్ర శరీరంతో సంపూర్ణాహుతి సమర్పించడంకోసమే ఆమె అంతటి గాంభీర్యంతో వ్యవహరించిందని గ్రహించుకున్నది. ఎంతటి చనువున్నా తనకయినా ఆ విషయం స్ఫురించకుండా ఉండడంకోసమే ఓషవతిగాథ ఉట్టంకించి, ప్రత్యేకించి పని కట్టుకుని వాగ్వివాదం కొనసాగించినదనికూడా ఆమె కవగతమయింది!

సర్వమంగళాదేవి ఆదరపూర్ణమయిన ఔదార్యం స్మరించగానే లవంగిక చెక్కిళ్ళపై వేడివేడి కన్నీటి బిందువులు ధారకట్టి ప్రవ హించాయి. అయినా ఆ శోకావేశం నిగ్రహించుకుని పరిపూర్ణ భక్తితో ఆమె ఆ దహనజ్వాలలలో పుష్పాంజలి సమర్పించింది. భూతలిపై మోకరిల్లి, చేతులుకట్టుకుని, ప్రణమిల్లి లోలోపలి దుర్భర వేదన భరించలేక, "అయ్యో తల్లీ! నీవంటి పావనమూర్తి నీ పాపిష్ఠి లోకం భరించగలదా?" అని పలికి అలాగే మూర్ఛపోయింది!

ఉవ్వెత్తుగా ప్రజ్వలిస్తున్న ఆహోమాగ్నిజ్వాలలలో ప్రవేశించిన సర్వమంగళ ఆకృతి అనతికాలంలోనే కేవలం భస్మరాశిగా మారి పోయింది!

సర్వగుప్తుడాపైన అయిదారుమాసాల పాటయినా కాశ్మీరం పరిపాలించలేదు। ఎన్నెన్ని ఘోరకృత్యాలుచేసినా అతని కంతకుమును పెన్నడు పశ్చాత్తాపమన్నది స్ఫురించలేదు। కాని ఆనాటి భీకర సంఘటనతో అతని వెన్నెముకే విరిగినట్టయింది। లోలోపలి హృదయంలో తీవ్ర పశ్చాత్తాపము, దుర్భర పాతివ్రత్యభీతి విషంపూసిన వాడివాడి ములుకులై మాటి మాటికి కళుక్కు కళుక్కుమని వేధించాయి। అతని నెల్లవేళల సర్వమంగళ అగ్నిజ్వాలా ప్రవేశదృశ్యమే పీడని పెనుభూతంలా వెన్నాడింది।

ఆపైన రాజ్యంలో అంతట ప్రజానీకం తిరుగుబాటులు, తోటిమంత్రుల కుతంత్రాలు పీడని బీభత్సాలై వేధించాయి। క్రమక్రమంగా అతని శరీరంలో దుర్భర రుగ్మతలేవో ప్రవేశించి శోషించిన రక్త మాంసా లపహరించాయి। సర్వగుప్తుడు ఆపైన మరి శయ్యనుండి లేవలేక తీరని ఆధివ్యాధులతో ఆలాగే కుమిలి కుమిలి కృశించి, కుళ్ళి కుళ్ళి మరణించి కాశ్మీర ప్రజలకందరికి పరమానందం కలిగించాడు।

కథా నిలయం
శ్రీకాకుళం